క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకాకాని: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మండలంలోని పలు గ్రామాలలో బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బత్తుల శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదని చెప్పారు. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, దేవరాయభట్లవారి పాలెం, పెదకాకాని కాళీ గార్డెన్ డొంక, స్వర్ణపురి కాలనీ గ్రామల వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కాకుమాను: వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు తాగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎస్.సురేష్ ఆదేశించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల(బాలికల) పాఠశాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పాఠశాల విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉన్న నీటి కుంటను చెరువులా ఏర్పాటు చేసి పక్కనే ఉన్న 5వ నంబర్ కెనాల్ నుంచి నీటిని సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. నీటిని మైక్రో ఫిల్టర్ ద్వారా శుభ్రపరచి విద్యార్థులకు తాగునీరు అందించే విధంగా వెంటనే ప్రణాళికను రూపొందించాలని ఏఈ రమేష్‌ను ఆదేశించారు. ఆయన వెంట వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, డీఈఈ ఏవీఎల్ ప్రసాద్ ఉన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలను సహించేది లేదు

ప్రత్తిపాడు: చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదంటూ ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలని కోరారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ నిర్వహిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

పెదనందిపాడు: ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధంగా చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పాతూరి శ్రీనివాస్, డిపార్టుమెంటల్ ఆఫీసర్ వనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 155 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

'లేపాక్షి' డిస్కౌంట్ అమ్మకాలు

పాత గుంటూరు: బ్రాడీపేటలోని లేపాక్షి హస్తకళ ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్ సందర్భంగా ఎంపిక చేసిన వస్తువులపై డిస్కౌంట్‌తో అమ్మకాలు చేస్తున్నట్లు మేనేజర్ ఎంవీఎస్ కుమార్ మంగళవారం ఒక ప్రటకనలో తెలిపారు. వస్తువులపై 10 శాతం నుంచి 50 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు రాయితీ ఉంటుందని, ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

17న బహిరంగ వేలం

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం ఆక్టోపస్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, వేలంలో పాల్గొనదలచిన వారు 9121102287ను సంప్రదించాలని సూచించారు.

అవ్వ, తాతల మోములో చిరునవ్వులు

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- కోయవారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



కోయవారిపాలెంలో స్థానికులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

కోయవారిపాలెం(ప్రత్తిపాడు): అవ్వ, తాతల మోముల్లో చిరునవ్వులు చిందేలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే సుచరిత అన్నారు. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. తొలుత గుంటూరు- పర్చూరు పాత మద్రాసు రోడ్డు వెంబడి ఉన్న అభయాంజనేయస్వామి విగ్రహానికి సుచరిత పూజలు చేశారు. అనంతరం దళితవాడలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గడప గడపకు వెళ్లారు. అవ్వా పింఛను అందుతుందా, తాతా రైతు భరోసా వస్తుందా.. అంటూ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందించారు.

ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధృఢ సంకల్పంతో పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు విప్పాల కృష్ణారెడ్డి, గుల్జార్‌బేగం, వెంకటలక్ష్మి, ఎంపీపీ దాసరి అన్నమ్మ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి, ఆర్ అండ్ బీ డైరెక్టర్ పిల్లి మేరి, పార్టీ నాయకులు వి.రత్నబాబు, జి.నాగరాజు, సర్పంచి కుందూరి లక్ష్మారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

చర్చి కాంపౌండ్ వాల్‌కు భూమి పూజ..

వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు ఎస్సీ కాలనీలోని సాగర్‌మాత చర్చి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే మేకతోటి సుచరిత శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మన్నవ వీరనారాయణ, సర్పంచి ఏసుబాబు, పార్టీ నాయకులు చిలకా సుబ్బారావు, మెట్టు వెంకటప్పారెడ్డి, పిల్లి మేరి పాల్గొన్నారు.

ఒడుదొడుకులను సమర్థంగా ఎదుర్కోవాలి

ఐటీ కర్వ్ ఫౌండర్, సీఈఓ శరణ్యరామ్



మాట్లాడుతున్న ఐటీ కర్వ్ ఫౌండర్, సీఈవో శరణ్యరామ్

పుల్లడిగుంట(ప్రత్తిపాడు): విద్యార్థి దశలో ఎదురయ్యే ఒడుదొడుకులను సమర్థంగా ఎదుర్కోవాలని ఐటీ కర్వ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, సీఈఓ నంబుల శరణ్యరామ్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు నిర్వహిస్తున్న మోటివేషనల్, ఇంటరాక్టివ్ సెషన్లు ముగిశాయి. మంగళవారం ముఖ్య అతిథిగా హాజరైన శరణ్యరామ్ నేటి తరం విద్యార్థులు తమ జీవితంలో ఉత్తమ స్థానానికి ఎలా చేరాలి, పరిజ్ఞానాన్ని ఎలా పెంపొందించుకోవాలి, లక్ష్యాలను ఎలా నిర్దేశించుకోవాలి, అన్న విషయాలను వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్క విద్యార్థి తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు పాల్గొన్నారు.

మిరప కోత విషయంలో జాగ్రత్తలు పాటించాలి



మిర్చి పంటను పరిశీలిస్తున్న జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రామాంజనేయులు

పెదనందిపాడు: మిరప పంట కోత విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రామాంజనేయులు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిధిలోని పాలపర్రులో మిరప, మొక్కజొన్న, పొగాకు పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్న కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. శనగ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు పండించిన శనగలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని, రైతులకు చాలా ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. ఆయన వెంట ఏడీఏ జి.ప్రవీణ, ఇన్‌చార్జి ఏఓ ఐ.సుబ్రహ్మణ్యం, వీఏఏ జి.పవన్‌కుమార్, ఉపసర్పంచి సంజీవరావు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ బాధ్యతగా తీసుకోవాలి



పెదకాకానిలో విద్యార్థినికి నులిపురుగు నివారణ బిళ్లలు మింగిస్తున్న ఎంఈవో బలిరాం

పెదకాకాని: విద్యార్థుల ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండలంలో మంగళవారం జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు, గర్భిణులకు మాత్రలు పంపిణీ చేశారు. పెదకాకాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని 45 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, రెండు జూనియర్ కళాశాలలు, ఐటీఐలో నులిపురుగు నిరవాణ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంఈఓ బలిరాం పాల్గొన్నారు.

పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి చర్యలు

- కమిషనర్ కీర్తి చేకూరి
- పార్కులలో అభివృద్ధి పనుల పరిశీలన



గాంధీ పార్కు అభివృద్ధి పనులపై సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచి, పచ్చదనం ద్వారా ఆరోగ్యాన్ని అందించే పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు.గాంధీ పార్కు, చుట్టగుంట వాకింగ్ ట్రాక్, జంక్షన్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధిపై నగర పాలక సంస్థ స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టిందని పేర్కొన్నారు. నగరంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. గాంధీ పార్కు పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని, త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా చూడాలన్నారు. అనంతరం చుట్టగుంట చెరువు వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులు పరిశీలించి, పనుల జాప్యంపై డీఈఈని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. చుట్టగుంట వాకింగ్ ట్రాక్, జంక్షన్‌లు నగరంలోకి వచ్చే ప్రధాన మార్గంలో ఉన్నందున గుంటూరు నగర ఖ్యాతిని ఇనుమడించేలా మోడల్‌గా ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం బుడంపాడులో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వెంచర్‌ను పరిశీలించి, కొలతలు తనిఖీ చేసి నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ఓపెన్ స్పేస్, రోడ్ల వెడల్పు, ప్లాట్‌ల సైజ్ ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండాలని చెప్పారు. పర్యటనలో ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ మూర్తి, డిప్యూటీ ప్లానర్ కోటయ్య, ఈఈలు సుందర రామిరెడ్డి, కోటేశ్వరరావు, కార్పొరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, రోషన్, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, కల్యాణ రావు, రమేష్ బాబు, ఏసీపీ అశోక్ కుమార్, ఏడీహెచ్ రామారావు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో పలు రికార్డులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్(ఎంఏయూడీ) విజిలెన్స్ అధికారులు మంగళవారం పరిశీలించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ ఎంక్వయిరీ కేసుల్లో యాక్షన్ టేకెన్ రిపోర్టు పంపకపోవడంపై నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులను పిలిపించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2010 సంవత్సరానికి ముందు ఆ తరువాత సుమారు 30 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వీటిన్నింటికి సంబంధించిన ఫైల్స్‌ను తెప్పించుకుని కూలంకుషంగా పరిశీలించారు.

ఇదే మొదటి సారి..

నగరపాలక సంస్థ చరిత్రలో ఎప్పుడు కూడా ఎంఏయూడీ విజిలెన్స్ అధికారులు వచ్చిన దాఖలాలు లేవని ఉద్యోగులు చెప్పుకోవడం గమనర్హం. ఏమైనా సిబ్బందిపై విచారణలు ఉంటే విచారణ నిమిత్తం ప్రత్యేక అధికారులను నియమించి వాటిని పరిష్కారించే వారు. కాని సదరు విజిలెన్స్ కేసుల్లో నగరపాలక సంస్థ అధికారులు వ్యవహారిస్తున్న నిర్లక్ష్య ధోరణికి చెక్ పెట్టేందుకు విజిలెన్స్ అధికారులు ప్రత్యక్షంగా వచ్చి పరిశీలించడంతో ఉద్యోగులు ఒకింత భయాందోళనకు గురైన పరిస్థితి నెలకొంది.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మైనార్టీ శాఖకు కేటాయింపు

పట్నంబజారు: తూర్పు నియోజకవర్గంలోని బీఆర్ స్టేడియం ఎదురుగా నిరుపయోగంగా ఉన్న బీసీ సంక్షేమ శాఖ వసతి గృహ సముదాయాన్ని మైనార్టీ శాఖకు కేటాయిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వసతి గృహం అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో ఆ భవనాన్ని మైనార్టీ శాఖకు కేటాయించాలని సీఎం జగన్‌కు విన్నవించిన నేపథ్యంలో ఆమోదం తెలిపారన్నారు. ఆ భవనంలో ముస్లిం మైనార్టీలకు సంబంధించిన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈసందర్భంగా మతపెద్దలు కృతజ్ఞతలు తెలిపి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

విజిలెన్స్ ఈఈ మూర్తి

ప్రత్తిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని విద్యుత్ విజిలెన్స్ ఈఈ కె.వి.ఎల్.ఎన్.మూర్తి హెచ్చరించారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, పెదగొట్టిపాడు, గనికపూడి, తుమ్మలపాలెం, ఈదులపాలెం, యనమదల, నడింపాలెం, తిక్కిరెడ్డిపాలెం, కోయవారిపాలెం, కొండేపాడు, నిమ్మగడ్డవారిపాలెం, తిమ్మాపురం, పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, వంగిపురం, మేడావారిపాలెం పంచాయతీల్లో విద్యుత్ విజిలెన్స్ బందాలు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. గుంటూరు విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వి.ఎల్.ఎన్.మూర్తి, గుంటూరు-2 ఈఈ సిహెచ్. రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఒక విద్యుత్ చౌర్యం కేసుతో పాటు కొత్తమల్లాయపాలెంలో 3, ప్రత్తిపాడులో 20, తుమ్మలపాలెంలో 3, గొట్టిపాడులో 3, కోయవారిపాలెంలో 4, యనమదలలో 1, వంగిపురంలో 2, తిక్కిరెడ్డిపాలెంలో 5, కొండేపాడులో 3, చినకోండ్రుపాడులో 5, నడింపాలెంలో 3 చొప్పున మొత్తం 2.30 లక్షల రూపాయల మేర 52 అదనపు లోడ్ కేసులు నమోదు చేశారు. అనంతరం ఈఈలు స్థానిక విద్యుత్ సబ్ స్టేషనులో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈలు మూర్తి, రమేష్ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు విద్యుత్ విజిలెన్స్ బృందాలు నిరంతరం తనిఖీలు చేపట్టినట్లు వివరించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

మేయర్ కావటి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో కరెంట్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరంలోని 20వ డివిజన్ కొబ్బరి తోట ప్రాంతంలో 16 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎలక్ట్రికల్, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, సర్వే అధికారులతో కలసి పర్యటించారు. అనంతరం సంపత్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 20వ పరిధిలోని పార్వతిపురం, బాబు రాజేంద్ర ప్రసాద్ కాలనీ, పీకలవాగు కట్ట, మేనక గాంధీ నగర్, అయ్యప్ప స్వామి గుడి ప్రాంతం, నల్లచెరువులోని కొన్ని ప్రాంతాలలో తరచుగా కరెంట్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక ప్రజల నుంచి చాలా కాలంగా ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. దీంతో ఎలక్ట్రిసిటీ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులతో కొబ్బరితోట ప్రాంతంలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. కొబ్బరి తోట ప్రాంతంలోనే కాక నగరంలో కరెంట్ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలలో ఎలక్ట్రికల్ అధికారులతో మాట్లాడి సబ్ స్టేషన్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రధాన రహదారుల విస్తరణ, రోడ్ల నిర్మాణం, సెంటర్ డివైడర్, హై మాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 16 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు అవసరమైన అనుమతులు వేగవంతం చేసి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఈఈ శ్రీనివాస బాబు, నగర పాలక సంస్థ డీఈఈ హనీఫ్, ఏఈలు చంద్రశేఖర్, రాంబాబు, సర్వేయర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఫార్మసీ రంగానికి పెరుగుతున్న ప్రాధాన్యం

వీసీ ఆచార్య రాజశేఖర్



సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ కరుణ తదితరులు

ఏఎన్‌యూ: ఫార్మసీ రంగానికి రోజురోజుకూ ప్రాధాన్యం పెరుగుతోందని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో 'కరెంట్ పారడైమ్స్ ఇన్ ఫార్మాసూటికల్ అనలిటికల్ టెక్నిక్స్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో అనలిటికల్ టెక్నిక్స్ ఉపయోగించడం వలన కొత్త రకాల మందులను కనుక్కోవడం త్వరితగతిన సాధ్యమవుతుందని చెప్పారు. దీని వలన మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఫార్మసీ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకునే నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. సమాజ హితమైన ఫార్మసీ రంగ అంశాలపై మరిన్ని పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ ఐఐసీటీ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ ప్రసంగిస్తూ గతంలో మందుల తయారీ కష్టతరంగా ఉండేదని నేడు అనలిటికల్ టెక్నిక్స్ కారణంగా ఎంతో సులభతరమయిందని వివరించారు. హైదరాబాద్ లక్సాయ్ లైఫ్ సైన్సెస్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ డాకర్ట్ శ్రీకాంత్ దిట్టకవి ప్రసంగిస్తూ బయోఎనలిటికల్ చాలెంజ్‌లో అనేక అంశాలు మనం క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ ప్రవల్లిక సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.ప్రమీలారాణి, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య సంధ్యాకోల్, గీతమ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శివకుమార్, నాట్కో ఫార్మసీ వైస్ ప్రెసిడెంట్ గ్నానదేవ్ ప్రసంగించారు. సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను వీసీ ఆవిష్కరించారు.

బహుముఖ ప్రజ్ఞ చూపిన విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ, లలిత తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: వివిధ కళాశాలలు, యూనివర్సిటీలు నిర్వహించిన పోటీల్లో హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విజ్ఞాన్ వర్సిటీలో ఇటీవల నిర్వహించిన ఉద్భవ్ పోటీల్లో టీం బిల్డింగ్ అంశంలో తరుణ్, సాయి, షేక్ షారూ ఖ్ ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. అదే విధంగా కళ్లం హరనాథరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో భాగంగా బిజినెస్ క్విజ్‌లో సీత కిరణ్మయి, నిఖిత, వెంకట కాత్యాయని, ద్వితీయ స్థానం, మార్కెట్ మేకర్స్‌లో వెంకట కల్యాణ్, వెంకట కాత్యాయని, హిమ నిఖిత తృతీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఏఎన్‌యూ నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో హిమ నిఖిత, అమృతవల్లి, దీపికా పరిశోధణ పత్రాలు సమర్పించారని తెలిపారు. విజ్ఞాన్ నిరులలో నిర్వహించిన నిరుల యంగ్ మేనేజర్‌తో పాటు బిజినెస్ క్విజ్‌లో పి.అమృతవల్లి విజేతగా నిలిచిందని వివరించారు. అదే విధంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన తమ విద్యార్థులు ఆల్ రౌండర్లుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, వి.చక్రవర్తి, సహాయ ఆచార్యులు కల్యాణి, వైష్ణవి, అభిలాష్ పాల్గొన్నారు.

జేఈఈ, నీట్, ఈఏపీ సెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ, నీట్, ఏపీ ఈఏపీ సెట్‌కు ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఉచిత శిక్షణనివ్వనున్నట్లు గణిత శాస్త్ర అధ్యాపకుడు పులుగు దీపక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది గుంటూరు, విజయవాడలలో ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఉచిత శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గుంటూరుతో పాటు ప్రతి మండల, జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో డిజిటల్ తరగతులు, సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్ తరగతులను ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం యూ-ట్యూబ్ చానల్, జూమ్ యాప్ ద్వారా సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇస్తామని తెలిపారు. ఉచిత శిక్షణ కోసం 7780150751 నంబరు ఫోన్ చేసి నమోదు చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు చదువులు చెప్పించే బాధ్యతతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు గుంటూరు ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగల నివారణ కార్యక్రమంలో భాగంగా రైలుపేటలోని గొలుసు నాంచారమ్మ- కొండలరావు నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో ఖుద్దూస్ మాట్లాడుతూ పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులి పురుగుల నివారణకు ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు వయసు గల పిల్లలు ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాల, కళాశాల విద్యార్థులకు పంపిణీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కడుపులో నులి పురుగులు వృద్ధి చెందితే పిల్లలు అనారోగ్యానికి గురవుతారని, ఆహారం, మురుగు చేతుల ద్వారా లార్వా చర్మం లోపలికి చొచ్చుకుపోవడం వలన వీటి సంక్రమణకు గురవుతారని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పక పాటించాలన్నారు. నులి పురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, బలహీతన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నులి పురుగుల నివారణ మాత్రలతో ఎంతో ఉపయోగం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ కీర్తి, డాక్టర్ పుష్ప, డాక్టర్ భాను ప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, స్కూల్ చైర్మన్ జాఫర్, సీఆర్పీ సరళ కుమారి పాల్గొన్నారు.

16న సమస్యల పరిష్కారానికి విద్యుత్ అదాలత్

గుంటూరు ఈస్ట్: ఈనెల 16వ తేదీ విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చల్లా రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు -2 డివిజన్ విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మేడికొండూరు మండలం డోగిపర్రు ఉపకేంద్రం ఆవరణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు అదాలత్‌కు హాజరు కావాలని కోరారు. అదాలత్‌ను టీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మాన్యుయేల్, సాంకేతిక సభ్యులు నిర్వహిస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని కోరారు.